విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

నేతన్నలను ప్రోత్సహించాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: జాతీయ చేనేత దినోత్సవం స్ఫూర్తితో నేత దారులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం తొమ్మిదవ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించు కుని నిర్వహించిన ర్యాలీలో జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి చేనేత కార్మికులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ స్థానిక తిరుమల కాలేజీ సెంటర్ నుండి జిల్లా కలెక్టరేట్ వరకు కొనసాగింది. అనంతరం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చేనేత ఉత్పత్తుల స్టాల్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించి, వస్త్రాల వివరాలను, ధరలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్పందన సమావేశ మందిరంలో చేనేత కార్మికులతో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవాన్ని ఉత్సాహంగా, అంకితభావంతో జరుపుకోవడమే కాకుండా చేనేత వస్త్రాలు కొనుగోలు ద్వారా కార్మికులకు అండగా నిలవాలన్నారు. చేనేత పరిశ్రమ ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. చేనేత కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం నేతన్న నేస్తం ద్వారా సంవత్సరానికి రూ.24 వేల చొప్పున జిల్లాలో 1,027 మంది లబ్ధిదారులకు అందజేస్తున్నదన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, డిపిఓ మల్లికార్జున రావు, డీఈవో ఆర్.వి రమణ చేనేత కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు.చేనేత కార్మికులు కుమారస్వామి తదితరులు మాట్లాడారు. ర్యాలీలో జిల్లా చేనేత జౌళి శాఖ ఇంచార్జ్ ఏడి బి.రామయ్య, కార్పొరేషన్ డైరెక్టర్ అందే నాగభూషణం, డిపిఓ మల్లికార్జున రావు, డీఈవో ఆర్ వెంకట రమణ, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ రంగ సాయి, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో అర్జీదారుల సమస్యలను పరిష్కరించండి

విశాలాంధ్ర-భీమవరం: ప్రజా సమస్యల పరిష్కారార్థం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీదారుల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతితో పాటు డిఆర్ఓ కె.క్రిష్ణ వేణి, డి.ఎస్.పి బి.శ్రీనాథ్, డి ఎల్ డి ఓ కెసిహెచ్ అప్పారావు, డిపిఓ మల్లికార్జునరావు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాల న్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న మూడు గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, 28 వార్డు సభ్యుల పదవులకు ఉప ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలన్నారు. ఆగస్టు 8 నుండి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న స్క్రూటీని, 14న ఉపసంహరణ, 19న పోలింగ్, ఓటర్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడం వెల్లడి ఉంటుందని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపివో కె.శ్రీనివాసరావు, డి ఎమ్ హెచ్ ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ జెడ్. వెంకటేశ్వరరావు, హౌసింగ్ పీడీ ఎస్.టి.వి రాజేశ్వరరావు, వయో వృద్ధుల ట్రిబ్యునల్ మెంబర్ మేళ్ళం దుర్గా ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా జగనన్న ఇళ్ళ నిర్మాణాలు

విశాలాంధ్ర - లింగపాలెం : చింతలపూడి నియోజక వర్గంలో జగనన్న ఇళ్ళ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని గృహ నిర్మాణశాఖ డీఈ రంగారావు వెల్లడించారు. ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించిన వివరాలను విలేకరులకు తెలిపారు. నియోజకవర్గంలోని చింతలపూడి, జంగారెడ్డిగూడెం, లింగపాలెం, కామవరపుకోట మండలాల్లో 10,937 ఇళ్ళు మంజూరయ్యాయని అన్నారు. వీటిలో 4,154 ఇళ్ళ నిర్మాణం పూర్తయ్యిందని, బేస్‌మెంట్ స్థాయిలో 2,497, శ్లాబ్ స్థాయికి 761, శ్లాబ్‌లు వేసినవి 420 ఉన్నాయని తెలిపారు. మరో 3 వేల 97 ఇళ్ళ నిర్మాణాలు ప్రారంభించవలసి ఉందని, వీటి నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నియోజకవర్గంలో మంజూరైన ఇళ్ళ నిర్మాణాన్ని ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. నిర్మాణాలలో లబ్దిదారులు శ్రద్ధగా నిర్మాణాలు చేసుకుంటున్నారని తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

విశాలాంధ్ర - లింగపాలెం : అక్రమంగా లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ శాఖాధికారులు ధర్మాజీగూడెంలో సోమవారం పట్టు కున్నారు. విజిలెన్స్ ఎస్ఐ రంజిత్ తమ సిబ్బందితో దాడి చేశారు. దీనికి సంబం ధించిన వివరాలను ఎస్ఐ వెల్లడిం చారు. కృష్ణా జిల్లా వీరులపాడు మండలం జయంతి గ్రామంలో సత్యం అనే వ్యక్తి వద్ద వీటిని కొనుగోలు చేసి తరలిస్తున్నారని తెలిపారు. 25 టన్నుల బియ్యం ఈ దాడిలో పట్టుబడ్డాయని, బియ్యాన్ని, వీటిని తరలిస్తున్న లారీని పట్టుకుని సీజ్ చేశామని వివరించారు. లారీని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. ఈ బియ్యాన్ని విజయవాడ, కాకినాడకు చెందిన పి.రామచంద్రరావు, దీప్ అనే వ్యక్తులు కొనుగోలు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో లారీ డ్రైవర్ సీతారామయ్యను, క్లీనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన బియ్యంపై కేసు నమోదు చేశారు. విజిలెన్స్ ఏఈ రూపేష్, సివిల్ సప్లయిస్ ఉప తహశీల్దార్ మొహిద్దీన్ ఈ దాడిలో పాల్గొన్నారు.

విధులకు హాజరుకాని రెవెన్యూ సహాయకులు

విశాలాంధ్ర - లింగపాలెం : లింగపాలెం మండలంలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు సోమవారం విధులకు హాజరుకాలేదు. వీరంతా తమ డిమాండ్ల పరిష్కారం కోసం జిల్లా కేంద్రం ఏలూరులో జరుగుతున్న ధర్నాలో పాల్గొనేందుకు తరలివెళ్ళారు. రెవెన్యూ సహాయకులు విధులకు హాజరుకాకపోవటం వల్ల రెవెన్యూ అధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఎంపీటీసీలకు విలువే లేదా?

విశాలాంధ్ర-చాట్రాయి: ఎంపీటీసీలకు విలువే లేదా గ్రామాల్లో చేసే పనుల గురించి కనీస సమాచారం చెప్పరా మాతో సంప్రదించరా అంటూ చాట్రాయి మండల పరిషత్ ఉపాధ్యక్షులు చల్ల గుళ్ళ జగన్ మోహన్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం చాట్రాయి మండల పరిషత్ కార్యాల యంలో ఎంపీడీవో దుర్గ ప్రసాద్ ఎన్ఆర్ఈజీఎస్ పనులు పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఒక్క సర్పంచ్ కూడా హాజరు కాలేదు 15 మంది ఎంపీటీసీలకు గాను ఎంపీపీతో పాటు మరో ఇద్దరు ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. సమావేశం జరుగుతుండగా వైస్ ఎంపీపీ చల్లగుండ్ల జగన్మోహన్ రావు జోక్యం చేసుకుని ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది గ్రామంలోకి వచ్చినప్పుడు కనీసం సమాచారం తెలియజేయడం లేదని పనులు గురించి మాతో చర్చించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణారావు పాలెం ఎంపీటీసీ మాట్లాడుతూ గ్రామస్థాయిలోకి వచ్చినప్పుడు గ్రామంలో జరిగే పనుల గురించి కూడా మాకు చెప్పకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఎంపీడీవో వివరణ ఇస్తూ ఇకముందు సమాచారం తెలియజేస్తామని నిర్లక్ష్యం వహిస్తే వారిపైన వారిపైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎంపీపీ లంకా నిర్మల, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో లక్ష్మీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

మోదీని గద్దె దింపాలి

ఏఐటీయూసీ మోటార్ సైకిల్ ర్యాలీ

విశాలాంధ్ర-పెంటపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ కార్మికవర్గం పోరాటం ఉధృతం చేస్తుందని, రానున్న ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ హెచ్చరించారు. క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో ఆగస్ట్ 9 న దేశ వ్యాప్తంగా జరగనున్న కార్మికవర్గ మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.మహాధర్నా డిమాండ్లను ప్రచారం చేస్తూ ఏఐటీయూసీ తాడేపల్లిగూడెం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మోటార్ సైకిల్ ర్యాలీ పెంటపాడు గేట్ సెంటర్ వరకు చేరుకుని సంత బజార్ వెలమ సంఘం భవనం కాలేజీ సెంటర్ మీదుగా పెంటపాడు గాంధీభవన్ సెంటర్ కి చేరుకుంది.ర్యాలీ ప్రారంభంలో కార్మికుల నుద్దేశించి డి.సోమసుందర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయన్నారు. కార్మికుల స్థితిగతులు దుర్భరంగా తయారయ్యా యని పేర్కొన్నారు. ఎన్నిసార్లు విన్నవించినా, పోరాటాలు చేసినా ప్రభుత్వం పెడచెవిని పెడుతున్నదని, తమకోర్కెలు పరిష్కారం కానిపక్షంలో కార్మికవర్గం ప్రస్తుత పాలకపక్షాలను గద్దె దింపడం ఖాయమని అన్నారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ కార్మికహక్కుల్ని కాలరాసిన మోదీ ప్రభుత్వం ఇప్పటికైనా లేబర్ కోడ్ లను ఉపసంహ రించి కార్మికచట్టాలను పునరుద్ధ రించాలని డిమాండ్ చేశారు.సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ పెట్రోల్ ,డీజిల్ , వంటగ్యాస్ ధరల పెరుగు దలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు. కార్యక్ర మంలో తాడికొండ శ్రీనివాసరావు, పడాల శ్రీనివాస్, పొలిరాతి ఆదినారాయణ, అంకం భాస్కరరావు, మెండెం జేమ్స్, రౌతు శ్రీనివాస రావు, రామిసెట్టి సత్తిబాబు, మాదు శ్రీను, కోడె బాలు, పిల్లంగోళ్ళ కృష్ణ, పెరికె శివరామకృష్ణ, సెట్టి సింహాచలం, దూలం ఆనంద్, నారాయణ, గోవింద్, కొడమంచిలి ముత్యం, కాటమరాజు, నాగరాజు, అల్లం సరేంద్ర, మండేల్లి పండు,కళింగ శ్రీనివాస్, రౌతు రాజేష్, మండేలి రామకృష్ణ , శివశంకర్, లక్క వరపు శ్రీను,సాయి, గోకా నాగరాజు, ఏడు కొండలు, నర్సన్న, మాదాసు సత్య నారాయణ, ఆంజనేయులు, చెన్నా సత్యనారాయణ, పాలూరి సుబ్రహ్మణ్యం,డి. పాండురంగా రావు, ధనరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా జయప్రదానికి ర్యాలీ

విశాలాంధ్ర -ఏలూరు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 9వ తేదీ క్విట్ ఇండియా రోజున విజయవాడ నగరంలో కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా జరుగుతుందని, ఆ ధర్నాలో కార్మికులు ఉద్యోగులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం నాడు విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఏలూరు నగరంలో సోమవారం నాడు ఏఐటీయూసీ, ఐఎఫ్ టియు, సిఐటియు సంఘాల నాయకత్వం నాయకులు కార్యకర్తలు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి విస్తృత ప్రచారం చేశారు. ఏలూరు జూట్ మిల్ వద్ద ప్రారంభమైన బైక్ ర్యాలీ జీఎన్ టి రోడ్డు, వసంత మహల్ సెంటర్, కర్రవంతెన, పవర్ పేట రైల్వే స్టేషన్ రోడ్డు, ఆర్ఆర్ పేట, ప్రభుత్వ ఆసుపత్రి మీదగా ఫైర్ స్టేషన్ సెంటర్లో ర్యాలీ ముగిసింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా నాయకులు కే కృష్ణమాచార్యులు, సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్వీడి ప్రసాద్, ఐ ఎఫ్ టి యు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తూ 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లు గా మారుస్తున్న మోదీ విధానాలను తిప్పికొట్టాలన్నారు. ర్యాలీలో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వర రావు, ఎఐటియుసి జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు, ఏ అప్పలరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ లింగరాజు, సిఐటియు నాయకులు బి. జగన్నాథం, వి. సాయిబాబు, బి సోమయ్య, పి కిషోర్, ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు, అప్పారావు, కాకర్ల శ్రీను, కే రామకృష్ణ, జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

విశాలాంధ్ర -భీమవరం: ప్రజా గాయకుడు గద్దర్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగా రావు, దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్ కుమార్, పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠ రావు అన్నారు. సోమవారం గద్దర్ మృతిపై స్థానిక సిఐటియు కార్యాలయంలో దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనమైన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్దర్ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. తన పాటలతో ఉద్యమాలకు ఊపిరి ఊదాడని కొనియాడారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు, సీఐటీయూ నాయకులు ఇంజేటి శ్రీనివాస్, దళిత నాయకులు ఏలేటి సునీల్ కుమార్, గొల్ల రాజకుమార్, మరపట్ల మునియ్య, పాలపర్తి జోనా తదితరులు పాల్గొన్నారు.

ప్రజానాట్యమండలి, వ్య.కా.సం సంతాపం

విశాలాంధ్ర-ఏలూరు: ప్రజా గాయకుడు, జననాట్యమండలి రాష్ట్ర నాయకులు గద్దర్ మృతికి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఓ ప్రకటనలో తీవ్ర సంతాపాన్ని తెలిపాయి. ఎన్నో ప్రజా సమస్యల మీద కళారూపాలను రూపొందించి పాటలు రచించి వాటిని ప్రదర్శించడం ద్వారా ప్రజలను చైతన్య పరచడంలో చూపించిన కృషి మరువలేనిదని పలువురు పేర్కొన్నారు. ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా కన్వీనర్ బళ్ళకనక దుర్గారావు, ఏపి వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వర రావు, ప్రజానాట్యమండలి ఏలూరు నగర నాయకులు తమ్మా విశ్వేశ్వరరావు, పల్లె వెంకటనారాయణ, గేదెల నాగేశ్వరరావు, తూతిక ధనంజయ, పాటూరి నాగేశ్వరరావు, పుప్పాల కన్నబాబు, కె జగన్, పోలా భాస్కర్, యర్రా వెంకటేశ్వర్లు, తదితరులు గద్దర్ మృతికి సంతాపం తెలిపారు. గద్దర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

గద్దర్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు

విశాలాంధ్ర-చింతలపూడి: గద్దర్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఐ చింతలపూడి మండల సహాయ కార్యదర్శి తోర్లపాటి బాబు అన్నారు. సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో గద్దర్ సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ చదువుకుంటున్న రోజుల నుంచి విప్లవబాట పట్టి తను ఆడి,పాడి తన పాటల ద్వారా ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో అనేక వందల మందిని ఆకర్షించి గాయకులుగా, ఉద్యమకారులుగా వారిని ప్రజా ఉద్యమాల వైపు మళ్ళించడంలో గద్దర్ అవిశ్రాంతంగా పనిచేశారని కొనియాడారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు, అణగారిన వర్గాలకు తీరని నష్టమని సంతాపం తెలియజేస్తూ,వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు. ఈ సంతాప సభలో సిపిఐ మండల కమిటీ సభ్యులు దొంతా కృష్ణ, కౌన్సిల్ సభ్యులు ఎస్.కె మస్తాన్, ఎస్ కె కాలేషా, రైతు సంఘం నాయకులు తాడి గడప మాణిక్యాలరావు, రాము, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME
I,Singaraju Gayathri (Old Name) W/o. Badaravada Bhanu Prasad Raju Resident at D.No:23-6-7, lakshmi Nagar Palakollu, West Godawari District- 534260, A.P India. I Changed My Name **Singaraju Gayathri (New Name)** Hence Forth I will be known as **BADARAVADA GAYATHRI**

చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

విశాలాంధ్ర-ఏలూరు: చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడుపు కన్నయ్య డిమాండ్ చేశారు. ఏలూరు రూరల్ మండలం శనివారపు పేటలో సోమవారం ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కడుపు కన్నయ్య మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ విదేశీ వస్త్ర బహిష్కరణ చేసి స్వాతంత్ర్యం మా జన్మ హక్కు అంటూ స్వాతంత్ర ఉద్యమంలో చేనేత కార్మికులు అగ్ర భాగాన నిలిచారని పేర్కొన్నారు. అటువంటి చేనేత రంగాన్ని కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న నేటి పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత పరిశ్రమను రక్షించుటకు కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో అధిక మొత్తంలో నిధులు కేటాయించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వర రావు, ఏపి చేనేత కార్మిక సంఘ కార్యకర్తలు మాడ వెంకటేశ్వరరావు, గుత్తి పోతురాజు, పిచ్చుక నాగరాజు, పేరక వెంకటేశ్వరరావు, గుంటూరు సత్యవతి, బళ్ళ కోటేశ్వరరావు, బళ్ళ లక్ష్మి, పిచ్చుక హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ధర్నా

విశాలాంధ్ర - వేలేరుపాడు : తమ సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్లు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా చేసి ఆ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎఐటియుసి మండల కార్యదర్శి కారం దారయ్య మాట్లాడుతూ ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా రాష్ట్రమంతటా ధర్నా చేపట్టినట్లు పేర్కొన్నారు. చాలీచాలని వేతనాలతో సంవత్సరాల తరబడి వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారే కానీ వారికి పనికి తగ్గ ఫలితం ఏ ప్రభుత్వాలు చూపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మారుమూల గిరిజన గ్రామాల్లో ఎంతో విలువైన సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వం గుర్తించి వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం 26,000 ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలు ఆశాలకు వర్తింప చేయాలని, సెలవులు, మెడికల్ లీవులు ఇవ్వాలని, వారిని వేధింపులు గురి చేస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల మండల అధ్యక్ష, కార్యదర్శులు కారం కుమారి,కరటం సీతామహాలక్ష్మి, రేవతి, టి. రాజేశ్వరి, పీ విజయ, పిట్టా సీత, మిరియాల సింధూర, కారం బోజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ మోటార్ సైకిల్ ర్యాలీ

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ , క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో ఈనెల9 న దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్ర, జిల్లా కేంద్రాల్లో కేంద్ర కార్మికసంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా జరగనున్న సంగతి తెలిసిందే. మహాధర్నా విజయవంతం చేయాలని కోరుతూ, ధర్నా డిమాండ్లను ప్రచారం చేస్తూ ఏఐటియుసి తాడేపల్లిగూడెం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సి.డబ్ల్యు.సి. గోడౌన్స్ సెంటర్ నుండి మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ స్థానిక ఆర్టీసీ డిపో , తాలూకా ఆఫీస్ సెంటర్ , ఓవర్ బ్రిడ్జి , కే.ఎన్. రోడ్, విజయా టాకీస్ సెంటర్, తాళ్ళ ముదునూరు పాడు పెంటపాడు మండల కేంద్రానికి చేరింది. పెంటపాడు ప్రధానవీధుల్లో జరిగిన ర్యాలీ పట్టణంలో ప్రవేశించి సిపాయిపేట లోని భవననిర్మాణ కార్మికసంఘం కార్యాలయం వద్ద ముగిసింది. ఏఐటియుసి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈర్యాలీలో, భవననిర్మాణ, మునిసిపల్, సి.డబ్ల్యు.సి, ఎస్.డబ్ల్యు.సి., కార్మిక సంఘాల కార్యకర్తలు, నాయకులు, ఎల్.అగ్రహారం, వెల్లమిల్లి గ్రామాలకు చెందిన భవననిర్మాణ కార్మికసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాదీ వస్త్రాలను ప్రోత్సహించాలి

విశాలాంధ్ర -భీమవరం: ఖాదీ వస్త్రాలను ధరించి చేనేత కార్మికులను ఆదరించాలని, మన సంస్కృతిని ప్రతిబింబించే దుస్తులు ధరించాలని ఆర్.ఆర్.డి.ఎస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె.ప్రసూన అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఖాదీ ఉద్యమాన్ని మళ్లీ ప్రారంభించాలని సూచించారు. కార్యక్ర మంలో భాగంగా చేనేత వస్త్రాలను కళాశాలలో ప్రదర్శించారు. అనంతరం ర్యాలీ చేపట్టి విదేశీ వస్త్రాలు వద్దు, స్వదేశీ వస్త్రాలు ముద్దని విద్యార్థులు ర్యాలీలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మికాంతం, డాక్టర్ కాకుమాని శ్రీనివాస్, డాక్టర్ అరవింద్ కుమార్, పి.ధనంజయ, ఎల్.నరసింహం, జి.ఉమామహేశ్వరి, పి.అమూల్యరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గద్దర్ మృతికి సంతాపం

విశాలాంధ్ర-కామవరపుకోట: జననాట్యమండలి నాయకుడు, ప్రజా గాయకుడు గద్దర్ మృతికి ఏపి ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టీవీఎస్ రాజు, ప్రజానాట్యమండలి పూర్వ గౌరవాధ్యక్షులు సీనియర్ బుర్రకథ కళాకారులు సబ్బి కనకారావు ప్రగాఢ సంతాపం తెలిపారు. గద్దర్ తన యావత్ జీవితాన్ని ప్రజలకు అంకితం చేశారని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో ఆయన ప్రత్యేక పాత్ర పోషించారన్నారు. . గద్దర్ మృతికి ప్రముఖ బుర్రకథ కళాకారులు వీరమల్ల సత్యనారాయణ, బచ్చు నందకుమార్, టివి బ్రహ్మాచారి, జానపద కళాకారుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఎల్ ఆర్ కృష్ణ బాబు, వర్ధమాన సినీ నటుడు తిరుపతి రమేష్ బాబు, తదితరులు గద్దర్ కు నివాళులర్పించారు.

నేతన్నలను ఆదుకోవాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: దేశంలో లక్షల మంది చేనేత కార్మికులున్నారని వారు ఎన్నో ఇబ్బందులతో జీవనం గడుపుతున్నారని వారిని కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా భీమవరం హౌసింగ్ బోర్డ్ కాలనీలో సోమవారం మహాత్మా గాంధీ విగ్రహానికి కోనాల భీమారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ స్వతంత్ర పోరాటంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా మహాత్మ గాంధీ విదేశీ వస్త్రాలు బహిష్కరించి దేశీ వస్త్రాలైన ఖద్దరు వస్త్రాలనువాడాలని ఇచ్చిన పిలుపుకు దేశమంతా స్పందించిందని ఆనాటి నుండి చేనేత కార్మికులు ఖద్దరు వస్త్రాలను తయారు చేస్తూ ప్రజలకు అందిస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా నాయకులు ఎం.సీతారాం ప్రసాద్, పట్టణ సిపిఐ కార్యదర్శి రంగారావు, న్యాయవాది ఎం.శ్రీనివాస రావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు కిలారి మల్లేశ్వరరావు, నాగిడి శాంతమూర్తి, చాంద్ భాషా, తిరుమాని చంటి రాజు, ఫోకస్ వ్యవస్థాపక అధ్యక్షులు గొన్నాబత్తుల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం అవసరం

విశాలాంధ్ర-తణుకు: సామాజిక సేవల ద్వారా జీవితంలో పొందిన సంతృప్తి చరమాంకం వరకు ఆనందాన్ని కలిగిస్తుందని శాసన మండలి సభ్యులు, లయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ వంక రవీంద్ర నాథ్ అన్నారు. విశాఖపట్నంలో గ్రీన్ పార్క్ కన్వెన్షన్ హాల్‌లో లయన్స్ జిల్లా అవార్డు ఉత్సవ కార్యక్రమంలో పాల్గొని విశాఖ శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో వివిద లయన్స్ క్లబ్ లలో విశేషంగా సేవలు చేసిన వ్యక్తులకు సంఘాలకు అవార్డులు ప్రదానం చేశారు. మానవాళి ఉన్నంతకాలం సమాజంలో అసమానతలు, సంపాదనలో వ్యత్యాసాలు ఉంటాయని సేవా దృక్పథంతో ఉన్న వ్యక్తులు సంఘాలుగా ఏర్పడి బాధలలో ఉన్నవారికి సహాయపడాలని రవీంద్ర నాథ్ అన్నారు.ఈ కార్యక్రమానికి పూర్వపు జిల్లా గవర్నర్ ఎం. ఉషారాణి అధ్యక్షత వహించారు. వైస్ గవర్నర్ ప్రసాద్, డి.సూర్య ప్రకాష్,పూర్వపు గవర్నర్లు రాఘవేంద్రరావు, డి.రమేష్ రాజు, డి వి ఎస్ వర్మ, ఎం. శర్మ, జి. మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఈఆర్‌యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటరమణ, సుబ్రహ్మణ్యం

విశాలాంధ్ర-ఉండి: ఏపి ఈఆర్‌యు జిల్లా అధ్యక్షులుగా తాడి వెంకటరమణ, కార్యదర్శిగా కెవిబి సుబ్రమణ్యంను ఏకగ్రీవంగా ఎన్నిక చేస్తూ నియామక పత్రాన్ని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సాంబశివ నాయుడు చేతుల మీదుగా సోమవారం విజయవాడలో అందించారు. ఈ సందర్భంగా చొప్ప వరపు సాంబశివ నాయుడు మాట్లాడుతూ పత్రికా విలేకరుల సమస్యలపై , హక్కులపై నిరంతరం పోరాడుతూ అనేక విజయాలను సాధించడంలో ఏపి ఈ ఆర్ యు యూనియన్ కీలకపాత్ర పోషించిందని తెలిపారు. ప్రభుత్వం నుండి విలేకరులకు రావలసిన అక్రిడేషన్ కార్డులు, హెల్త్ ఇన్సూరెన్స్, రైల్వే, బస్సు పాసులు, ఇండ్లస్థలాలు మొదలగు సమస్యలపై నిరంతరం పోరాడుతూ ఎన్నో విజయాలు సాధించిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో యూని యన్ రాష్ట్ర కార్యదర్శి సాయికుమార్, విజయవాడ యూనియన్ అధ్యక్షులు హుమాయన్ మహమ్మద్, యూనియన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ, యూనియన్ రాష్ట్ర కోశాధికారి కోటేశ్వరరావు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్ శంకర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటులో ఎస్సీవర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలి

విశాలాంధ్ర-టీ నరసాపురం: పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని ఎపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ మాదిగ డిమాండ్ చేశారు. చలో హైదరాబాద్ మాదిగ విశ్వరూప మహా సభ, సన్నాహక సదస్సు బందంచర్ల గ్రామంలో ఎమ్మార్పీఎస్ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి లంకా జయబాబు అధ్యక్షతన సోమవారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సురేష్ మాదిగ మాట్లాడుతూ చలో హైదరాబాద్ మాదిగవిశ్వరూప మహా సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు మాదిగలను ఓటు బ్యాంకుగా వాడు కుంటున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా నాయకులు కనకరాజు , చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి జోసెఫ్ తంబీ, బందంచర్ల గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ మృతికి సంతాపం

విశాలాంధ్ర-తణుకు: మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పీతల కృష్ణ మృతికి సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తీవ్ర సంతాపాన్ని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సోమ వారం తణుకులో పీతల కృష్ణ నివాసంలో ఆయన కుమారుడు పీతల శివకుమార్, కుటుంబ సభ్యులను పరామర్శించి నివాళులర్పించారు. మున్సిపల్ కౌన్సిలర్ గా పనిచేసిన పీతల కృష్ణ ప్రజాసమస్యల పరిష్కారానికి, వార్డు అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, పార్టీ జిల్లా సమితి సభ్యుడు బొద్దాని కృష్ణ కిషోర్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

ఉద్యమాలకు స్ఫూర్తి గద్దర్

విశాలాంధ్ర-ముదినేపల్లి: ఉద్యమాలకు స్ఫూర్తి గద్దర్ అని సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రజా చైతన్య విప్లవ గాయకుడు గద్దర్ మరణానికి సంతాపంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిమ్మగడ్డ బిక్షాలు, గౌస్ బేగ్ , ఈడే శ్రీనివాసరావు , సోమల వరప్రసాదరావు , అబ్దుల్ రహీం, పుట్టి నరసింహారావు, ఈడే ఉమామహేశ్వరరావు, గద్దర్ జీవితాన్ని మననం చేసి నివాళులర్పించారు.

గద్దర్ మృతి విచారకరం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : ప్రజలలో చైతన్యం తీసుకురావడం కోసం తన విప్లవ, జానపద పాటలతో ప్రజల హృదయాలు గెలుచుకున్న గద్దర్ మృతి బాధాకరమైన విషయమని సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయం వద్ద గద్దర్ సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేద ప్రజలు అనుభవిస్తున్న కష్టనష్టాలను తన పాటలతో కళ్ళకు కట్టినట్లుగా నాటకాల రూపంలో ఉద్యమాలను ఉర్రూతలు ఊగించిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. ముందుగా గద్దర్ మృతి పట్ల మౌనం పాటించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయక కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, పట్టణ కార్యదర్శి ఎస్ కె బాజీ, వెలగల రామారావు, మట్టా రామకృష్ణ, గోపాలం, ఇళ్ల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

నా మట్టి .. నా దేశం స్ఫూర్తిగా కలెక్టర్ సెల్ఫీ

విశాలాంధ్ర భీమవరం: స్థానిక కలెక్టర్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సెల్ఫీ పాయింట్ వద్ద సోమవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆజాదీకా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో "నా మట్టి -నా దేశం, నేల తల్లికి నమస్కారం - వీరులకు వందనం "అనే ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఈనెల 9వ తేదీ నుండి 20వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నా మట్టి.. నా దేశం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడానికి ప్రణాళికను సిద్ధం చేయడం జరిగిందన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు, మండలాలు, పట్టణ ప్రాంతాల్లో పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. దేశ సంక్షేమం కోసం ప్రాణ త్యాగాలు చేసిన స్థానిక మహనీయులను, సాహసవంతులు, వీరులను స్మరించుకోవడం జరుగుతుందన్నారు. ఈనెల 9వ తేదీన అన్ని గ్రామాలు, పట్టణాల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సందేశంతో పాటు దేశం కోసం పోరాడిన స్వాతంత్ర సమరయోధులు, త్యాగధనులు, వీరులను గుర్తు చేసుకుంటూ అమృత సరోవర్ల నీటి వనరుల వద్ద జ్ఞాపక శిలాఫలకాలను ఏర్పాటు చేసుకొని సెల్ఫీలను దిగి నిర్ణీత వెబ్సైట్లో అప్లోడ్ చేయడం జరుగుతుందన్నారు.

నులి పురుగులు నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

విశాలాంధ్ర - గణపవరం: నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిప్పర పిహెచ్ సి డాక్టర్ కె ప్రియాంక అన్నారు. సోమవారం గణపవరం మండలం కాశిపాడు ఉన్నత పాఠశాలలో ఈ నెల 10వ తేదీన జరిగే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం సంబంధించిన వాల్ పోస్టర్, కరపత్రికలను ఆమె విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు, కిశోర్ బాలలకు కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే వారిలో పోషకాహార లోపం,రక్తహీనత నీరసంగా ఉంటారని,శారీరక ,మానసిక ఎదుగుదల లోపాలను కలిగి ఉంటారని అల్బెండజోలు 400మి. గ్రా.మాత్ర ద్వారా నులిపురుగుల సంక్రమణను సులభంగా నిర్మూలించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం. ఏఎస్ఎస్ బిఆర్ ప్రసాద్, ఉపాధ్యాయులు, పీహెచ్ఎం వి. అన్న కుమారి, లెప్రసి నోడల్ పర్సన్ నామాల రాజు, ఏఎన్ఎం శివ కుమారి, ఆశ కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెదవాగు ప్రాజెక్టు కాలువ పరమ్మతులకు రూ.45 లక్షల ప్రతిపాదనలు

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: పెద వాగు ప్రాజెక్టు కాలువ మరమ్మత్తు పనులకు రూ. 45 లక్షల ప్రతిపాదనలు పంపినట్లు ఇరిగేషన్ డిఈ జి. హేమరత్న తెలిపారు. జీలుగుమిల్లి ఇరిగేషన్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ పెద వాగు ప్రాజెక్టు ఆయకట్టు ఆంధ్రప్రదేశ్ లో 13640 ఎకరాలు ఉందన్నారు. ఈ ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్రంలో ఉండగా కొంతమేర ఆయకట్టు ఆంధ్రప్రదేశ్ లో ఉందన్నారు. కాలువల మరమత్తు పనులు చేసినట్లయితే పంటలు ఎక్కువగా పండించుకోవచ్చన్నారు. జీలుగుమిల్లి మండలంలో 45 చెరువులు 19 చెక్ డ్యాములు ఉన్నాయని అన్నారు.

సాగు భూములకు ఆన్‌లైన్ చేయాలి

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: 40 సంవత్సరాలుగా పోడు భూములను అభివృద్ధి చేసి అందులో పంటలు పండించుకుంటున్నామని, ఆ భూములపై అధికారులు ఆన్ లైన్ చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు. సోమవారం తాటి రామన్న గూడెం గిరిజనులు తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగు భూమిలో మేము ఉంటే వేరే వారికి ఆన్ లైన్ ఎలా చేశారని అధికారులను నిలదీశారు. వేరే ఊరు నుండి వచ్చి మా భూములు ఆన్ లైన్ లో చేసుకోవడానికి కొంతమంది స్థానిక నాయకులు అండతో చేశారని ఆరోపిస్తున్నారు. మా గ్రామంలో సాగు చేసుకుంటున్న భూములకు ఆన్ లైన్ చేయాలని గిరిజనులు తహసీల్దార్ జి సుందర్ సింగ్ వినతిపత్రం అందజేశారు. గద్దం నాగమణికి చేసిన ఆన్ లైన్ రికార్డులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు న్యాయం చేయాలని పోలవరం నియోజకవర్గం జనసేన కన్వీనర్ సిరి బాలరాజు డిమాండ్ చేశారు. ఇక్కడ పరిష్కారం కాకపోతే కలెక్టర్ వద్దకు వెళదామని హెచ్చరించారు. దీనిపై తహసీల్దార్ జి. సుందర్ సింగ్‌ను వివరణ కోరగా పూర్తిస్థాయి విచారణ చేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుంజా రాజేష్, కుంజా రమేష్, కుంజా సోమరాజు, తాటి ముత్తమ్మ, పూనే మంగయ్య, పెనుబల్లి భద్రయ్య, మడకం చినరాజులు, కుంజా తులసి, తదితర గిరిజనులు పాల్గొన్నారు.

మనకోసం మనం ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర-పాలకొల్లు: మన కోసం మనం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పోడూరు మండలం జిన్నూరు హైస్కూల్లో విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. జిన్నూరు హైస్కూల్, ఎన్ఆర్ పేట, భూపయ్య చెరువు, జిన్నూరుపాలెం, పెదపేట, మెయిల్ స్కూల్‌లో సుమారు 350 మందికి విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ల పలకలు, పంపిణీ చేశారు. మాజీ సొసైటీ అధ్యక్షులు దేవళ్ళ ప్రసాద్ ఆర్థిక సహాయంతో వీటిని అందజేశారు. సంస్థ అధ్యక్షులు పడాల పెద్దిరాజు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి సేవా భావం అలవర్చుకోవాలని, సహాయం చేయటంలో ఉన్న ఆనందం వెలకట్టలేనిదని అన్నారు. దాత దేవళ్ళ ప్రసాద్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జిన్నూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శివజ్యోతి, సంస్థ సభ్యులు కలిశెట్టి కనకారావు, దాసరి సత్యనారాయణ, దాసరి సూర్యనారాయణ, కలిశెట్టి లక్ష్మి, గలవిల సత్యనారాయణ మూర్తి, పడాల కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులచే చేనేత వస్త్రధారణ పోటీలు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కైకరం సోమవారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రథమ సహాయకులు సిహెచ్ శ్రీనివాస్ కుమార్ అధ్యక్షత వహించారు. చేనేత దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే చేనేత వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. చేనేత కళ అంశం పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. వక్తలు మాట్లాడుతూ చేనేత వస్త్రాలు నిత్యజీవితంలో ఉపయోగించటం ద్వారా చేనేత కళాకారులని ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు జి. గవరయ్య, పివి కన్నారావు, జి. నాగసుధ, ఇ.పాపయమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరభద్రవరంలో టిడిపిలోకి 40మంది

విశాలాంధ్ర-టి నరసాపురం: వెలగపాడు పంచాయతీ వీరభద్రవరంలో గ్రామంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు సమక్షంలో పంచాయతీ వార్డు మెంబరు నైనారపు నాగేశ్వరరావు, తోట సత్యనారాయణ తో పాటు సుమారు 40 మంది తెలుగుదేశం పార్టీలో సోమవారం చేరారు. శీలం వెంకటేశ్వరరావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధాణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని ప్రజలు టిడిపి విజయాన్ని కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నైనారపు జలపాలు తదితరులు ఉన్నారు.

పిడిఎఫ్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర - భీమవరం టౌన్: భీమవరం ఇండస్ట్రియల్ ఎస్టేట్ లో అక్రమంగా నిలువ చేసి, అనంతరం తరలిస్తున్న సుమారు మూడు టన్నుల పి.డి.ఎస్ బియ్యంను సోమవారం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. వీటి విలువ రూ.59,400 ఉంటుందని బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని విజిలెన్స్ సిఐ శివరామకృష్ణ తెలిపారు.

స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన భూమికపోషించిన చేనేత రంగం

విశాలాంధ్ర-ఉంగుటూరు : స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన భూమిక పోషించి, స్వాతంత్ర్య సముపార్జనకు ఒక సాధనంగా నిలిచింది చేనేతయేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం ఏలూరులో జరిగిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమానికి వైఎస్ఆర్సిపి ఏలూరు జిల్లా వీవర్స్ సెల్ అధ్యక్షులు దొంతం శెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉంగుటూరు నుండి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చేనేత ప్రదర్శనను జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు రఘునంద మాట్లా డుతూ స్వాతంత్ర్య సమరంలో మహాత్మా గాంధీ నూలు వడికి స్వదేశీ వస్త్రాల తయారీ ఎంతో శక్తివంతైందని చాటారు. ఏలూరు జిల్లా వైఎస్ఆర్సిపి వీవర్స్ సెల్ అధ్యక్షులు దొంతం శెట్టి సత్యనారా యణ మాట్లాడుతూ మగ్గానికి మహర్దశ వ చ్చిందని, మొత్తం చేనేత రంగం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపిన ప్రత్యేక శ్రద్ధతో సంక్షేమాన్ని అందుతుంద న్నారు. ఈ సందర్భంగా ఇద్దరు చేనేత కార్మికులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్ర మంలో డెవలప్మెంట్ అధికారి హనుమంతు రావు, చేనేత కార్మికులుఆకుల రామకృష్ణ, తీడ ప్రసాద్, కోసూరి శ్రీనివాస్, పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా విప్లవకవి, గద్దర్ సంతాప సభ

విశాలాంధ్ర-తణుకు: తన ఆట, పాట, మాటతో పీడిత ప్రజల విముక్తిని స్వప్నించి శ్రమించిన ప్రజా యుద్ధనౌక గద్దరన్న ఆకస్మిక మృతి అందర్నీ దిగ్భ్రాంతికి గురి చేసిందని సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పేరూరి మురళీకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.కవులు, కళాకారుల, అభిమానులు, వివిధ ప్రజాసంఘాల నేతలతో సోమవారం తణుకులోని సురాజ్య భవన్లో సంతాప సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. సభకు ప్రముఖ న్యాయవాది గొల్లపల్లి అంబేడ్కర్ అధ్యక్షత వహించారు. సామాజికవేత్త నీలం మాల్యాద్రి, ప్రముఖ అంబేడ్కర్ వాది నూకపేయి వెంకటేశ్వర రావు, దళితనేతలు పిళ్ళా డైమండ్ రాజు, కొండే నాగేశ్వరరావు, న్యాయవాదులు వెన్నపు సుధాకర్, నక్కా అజయ్ కుమార్, పౌరహక్కుల సంఘం నేత కౌరు వెంకటేశ్వర్లు, శ్రీలంక బౌద్ధ గురువు బోధి హీన్,కె. ఎన్. పి. ఎస్ నాయకులు జాన్ రాజు, కార్మిక నేత మస్తాన్, బీసి నాయకులు నిడదవోలు సుబ్బారావు , శ్రీనువాస్, మహిళా నాయకురాలు షర్మిల, దళిత నాయకులు గెడ్డం సోమశేఖర్, గొల్లపల్లి వివేకానంద, విప్పర్తి ప్రసాద్, యార్లగడ్డ రవీంద్ర , ఎలిపే సురేష్ , శేఖర్ తదితరులు గద్దరన్న కు నివాళులర్పించారు.

వైసీపీలోకి టీడీపీశ్రేణులు

విశాలాంధ్ర -ముసునూరు: ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పెట్టిన పథకాలకు ఆకర్షితులై టిడిపి నుండి వైసిపిలోకి చేరుతున్నారని నూజివీడు నియోజక వర్గ శాసనసభ్యులు మేకా వెంకటప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన కాటేపల్లి రమేష్,చిలుకూరి శ్రీనివాసరావు,కాటేపల్లి వరప్రసాద్,మందలపు దర్గారావులతో పాటు మరో 50మంది కార్యకర్తలు వైసిపి మండలపార్టీ అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు పార్టీ కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. జెడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్,వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన,పాముల గంగధరరావు,ఎంపిటిసి తోట రమాదేవి, లోపూడి సర్పంచ్ పేరం కృష్ణ,ఉప సర్పంచ్ పద్మజాదేవీంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాయకత్వంపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర -లింగపాలెం : ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగే ఎన్నికలపై విద్యార్థులకు, సిబ్బందికి ఎన్నికలు నిర్వహించే తీరుపై అవగాహన కార్యక్రమాన్ని రంగాపురం ప్రధానోపాధ్యాయుడు వెంకటరత్నం సోమవారం నిర్వహించారు. విద్యార్థులకు విద్యతోపాటు మంచి నాయకత్వ లక్షణాలు అలవడాలని దీనివల్ల సమాజంలో మంచి నాయకులు తయారవుతారని వివరించారు. బేలెట్ విధానంతో నాయకులను ఎన్నుకునే ఓటింగ్ పద్ధతి నిర్వహించి ఈ పాఠశాలలో నాయకులను ఎన్నుకోవటం జరిగింది. ఎస్పి ఎల్ గా పదవ తరగతికి చెందిన పి రత్నరాజు, డిప్యూటీ ఎస్పి ఎల్ గా ఎనిమిదవ తరగతి చదువుతున్న కె అనీల్ ఎన్నికయ్యారు. ఎన్నికైన విద్యార్థి నాయకులు పాఠశాలలోని విద్యార్థుల సమస్యలపై కృషిచేయాలని పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

వాణిజ్యంలో సాంకేతిక మార్పులకు తగ్గట్టుగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి

విశాలాంధ్ర - పాలకొల్లు: అంతర్జాతీయ వాణిజ్య దినోత్సవం సందర్భంగా సోమవారం పాలకొల్లు పట్టణంలోని స్థానిక బి ఆర్ ఆర్ అండ్, జి కే ఆర్ చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలల్లో, కామర్స్ అండ్ మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డా.గ్రేస్ గంట ఎంబీఏ పిహెచ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ గ్రేస్ మాట్లాడుతూ వాణిజ్యం అభ్యసించే విద్యార్థులు, మారుతున్న నూతన విద్యా విధానాలను పరిస్థితులను గమనిస్తూ, వాణిజ్యంలో సాంకేతిక మార్పులకు తగినట్టుగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. వాణిజ్యంలో వస్తున్న కొత్త పోకడలకు గాను, నూతన కోర్సులను అభ్యసించి ఆ కోర్సులను తమ వృత్తి నైపుణ్యాలలో ప్రదర్శించాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ అభివృద్ధిలో వాణిజ్యం పాత్ర, విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనకు భారీ సంఖ్యలో తరలివెళ్లిన టిడిపి శ్రేణులు

విశాలాంధ్ర-టి నరసాపురం: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలో సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వస్తున్న సందర్భంగా సోమవారం మండలంలోని టి నరసాపురం, మక్కినవారిగూడెం, తిరుమలదేవిపేట తదితర గ్రామాల నుండి టిడిపి నాయకులు భారీ సంఖ్యలో తరలి వెళ్ళినట్లు టిడిపి రాష్ట్ర నాయకులు జయవరపు శ్రీరామమూర్తి, శీలం వెంకటేశ్వరరావు తెలిపారు. మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్ ఆధ్వర్యంలో 500మంది టిడిపి శ్రేణులు 100కార్లతో ర్యాలీగా బయలుదేరి పోలవరం వెళ్ళారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి అచంట అనీల్ కుమార్, బిసి సెల్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి కొండపల్లి, మాజీ జడ్పీటీసీ నల్లూరి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం పలికిన కొవ్వూరు తెదేపా నాయకులు

విశాలాంధ్ర-కొవ్వూరు : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు చేపట్టిన ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా సోమవారం పోలవరం ప్రాజెక్టుకు కొవ్వూరు మీదుగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కొవ్వూరు గ్రామన్ ఇండియా వంతనపై కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ చౌదరి, కంటమని రామకృష్ణ ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి చంద్రబాబు గోదావరి మాత విగ్రహం వద్ద నుంచి ఆరికరేవుల కుమార్ దేవం చిడిపి గ్రామాల మీదుగా తాళ్లపూడి మండలం చేరుకున్నారు. అక్కడ ఉన్న తాడిపూడి ఎత్తిపోతల పథకాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తాళ్లపూడి నాయకులు నామన పరమేశ్వర రావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. తాడిపూడి ఎత్తిపోతల పథకాన్ని సందర్శించిన వారిలో మాజీ మంత్రులు దేవినేని ఉమా, పితాని సత్యనారాయణ, కె ఎస్ జోహార్, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించండి

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు మండలం చేబ్రోలు పారిశుద్ధ్య కార్మికులు వారి ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పని చేయడమే కాకుండా ప్రజా ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్నారని, కార్మికుల శ్రమకు తగిన వేతనాలు పెంచడం లేదని, సక్రమంగా నెలవారీ జీతాలు అందకపోవడం, పిఎఫ్,ఇఎస్ఐ అమలు కాకపోవడం, వారాంతరపు సెలవులు, ఇతర బెనిఫిట్స్ అమలు కాకపోవడంతో వారి కుటుంబాలు అనేక ఇబ్బందు లను ఎదుర్కొంటున్నాయని ఏఎఫ్‌టియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంబాల సతీష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గొల్లప్రోలు మండలం చేబ్రోలు పంచాయతీలో ప్రగతిశీల పారిశుద్ధ్య కార్మికుల సమైక్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు అనంతరం పంచాయతీ సిబ్బందికి మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘాల సమైక్య ఏఎఫ్‌టియూ కాకినాడ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొత్స యేసు, డి నారాయణమూర్తి, పారిశుద్ధ్య కార్మికులు కొరకంటి తాతీలు, దొండపాటి ఏసు, డి నూకరాజు, గడాల సత్తిబాబు, ఓరుగంటి దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో నిలిచిన గద్దర్

విశాలాంధ్ర - జగ్గంపేట : ప్రజా గాయకుడిగా ప్రజల హృదయాల్లో నిలిచిన వ్యక్తి గద్దర్ అని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. జగ్గంపేట శివారు రామవరం రంగవల్లి నగర్‌లో ఏపీ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు, కామ్రేడ్ గద్దర్ సంతాప సభ జరిగింది. ముందుగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ తన కలాన్ని, గళాన్ని ఆట, పాటలను పీడిత ప్రజల విముక్తి కోసం వినియోగించారన్నారు. గద్దర్ పోలీస్ నిర్బంధాలను, తుపాకీ తూటాలను ఎదుర్కొని అట, పాటలతో శత్రువుకు సవాల్ విసురుతూ అన్ని వర్గాల పీడిత ప్రజలను ప్రజా యుద్ధం లోకి సన్నద్ధం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్‌సిఎస్ నాయకుడు డి సురేష్, డాన్ శ్రీను సోమరాజు, మంగమ్మ, దేవి, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని ఆత్రేయపురం గ్రామంలో అల్లూరి సీతారామరాజు సెంటర్ వద్ద స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైయస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి గర్భిణీ స్త్రీల ఆరోగ్యం దృష్ట్యా పుట్టబోయే పిల్లలు ఆరోగ్యవంతంగా పుట్టాలనే ఆలోచనతో, పేద వర్గాల మహిళలు పౌష్టికాహార లోపాలతో ఇబ్బందులు పడకూడదు అనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న వైయస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణీ స్త్రీలు, బాలింతలకు ఆత్రేయపురంలో మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి అందచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇరవై మంది గర్భిణీ స్త్రీలకు పండ్లు, పువ్వులు, గాజులు, పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను అందించారు. ఈ సందర్భంగా మహిళలకు నూతన వస్త్రాలు కానుకగా అందించారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుండా అన్నపూర్ణ, జడ్పీటీసీ బోనం సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం, కిరాణా, నగదు పంపిణీ

విశాలాంధ్ర - కరప : వృద్ధాప్యం, అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు నిరుపేదలకు స్థానిక విజయ రాయుడుపాలెంలోని షాలెం బాప్టిస్ట్ చర్చి సంఘ నాయకుల ఆధ్వర్యంలో బియ్యం, కిరాణా సరుకులు, నగదును పంపిణీ చేశారు. సోమవారం చర్చిలో సంఘ నాయకులు కొరమాటి జాన్ విలియం కేరీ, కె సంజీవరావు, ఎం అబ్బాయి, పాస్టర్ ఎస్ రాజకుమార్లు కలిసి ఆ గ్రామంలోని చూపు కోల్పోయిన నేతల చంద్రరావు, బేబీ దంపతులకు 25 కేజీల బియ్యం, కిరాణా సరుకులు, కొంత నగదును అందించారు. అదే గ్రామంలో వృద్ధాప్యంలో బంధువులకు దూరమై ఒంటరిగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న బుంగా సూర్యకాంతంకు వైద్య నిమిత్తం ఐదు వేల రూపాయలను అందించారు. చంద్రరావు దంపతులకు, సూర్యకాంతంనకు సహాయం అందించడం పట్ల పాస్టర్ రాజ్ కుమార్, సభ్యులు జాన్ విలియం కేరీ, సంజీవరావు, అబ్బాయిలను గ్రామస్తులు, స్థానిక నాయకులు అభినందించారు.

కిక్ బాక్సింగ్లో సత్తాచాటిన జ్యోతి

విశాలాంధ్ర - రాజానగరం : బలం,వేగమైన పంచులతో ప్రత్యర్థులను మట్టి కరిపించి తనదైన శైలిలో క్రీడల్లో విజయాలు సాధించి ఆదికవి నన్నయ్య వర్సిటీ కీర్తి ప్రతిష్టలు దేశవ్యాప్తంగా నలు దిశలు వ్యాపింపజేశారు ఏలూరు సి.ఆర్.రెడ్డి కళాశాలకు చెందిన విద్యార్థిని కె.జ్యోతికుమారి. నన్నయ వర్సిటీ తరుపున ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో గత మార్చి నెలలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఉమెన్ కిక్ బాక్సింగ్ పోటీల్లో సత్తాచాటారు. ఈ సందర్భంగా నన్నయ వర్సిటీ నందు సోమవారం అభినందన సభ నిర్వహించారు.దీనిలో భాగంగా క్రీడాకారిణి కె.జ్యోతి కుమారిని వీసీ సన్మానించి జ్ఞాపిక, సర్టిఫికెట్టులను అందించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కిక్ బాక్సింగ్(ఉమెన్) వీర్ బహదూర్ సింగ్ పూర్వాంచల్ విశ్వవిద్యాలయం ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో మార్చి 20 నుండి 22 తేదీలలో జరిగిన పోటీలలో కె.జ్యోతికుమారి ద్వితీయ స్థానం సాధించడంతో సిల్వర్ మెడల్ ను కైవసం చేసుకుందన్నారు.ఆదికవి నన్నయ వర్సిటీ వ నుండి రూ:20వేలు నగదు అవార్డు, సర్టిఫికెట్స్ ను అందజేసామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ క్రీడాకారిణి జ్యోతికుమారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జ్యోతికుమారి తల్లి కె.నాగమణి, కోచ్ వి.అంజిబాబు, బాక్సింగ్ అఫీషియల్ సిహెచ్.చంద్రశేఖర్, ఎం.భవాని శంకర్, పి.నాగరాజు,ఎ.ధర్మేంద్ర స్పోర్ట్స్ బోర్డు కోఆర్డినేటర్ డాక్టర్ కె.సుబ్బారావు, సెక్రటరీ డాక్టర్.బి.రామ్ గోపాల్, డాక్టర్.బాల సత్యనారాయణ, డాక్టర్.వివిఎంయు.ఫణీంద్ర, డాక్టర్.ఎంవివిఎస్.మూర్తి, హబీబ్ భాష తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నులి పురుగుల నివారణపై అవగాహన

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నులి పురుగుల నివారణ కార్యక్రమం, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఆర్ఎస్ఎస్వి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో నమోదు కాబడిన పిల్లల అందరితో అల్బెండజోల్ మాత్రలు మింగించాలన్నారు. 1-3 సం.రాల పిల్లలకు 200 మీ.గ్రా.మాత్ర, 3-19 సం.రాల పిల్లలకు 400 మీ.గ్రా. మాత్ర మధ్యాహ్న బోజనం తరువాత నమిలి మింగించాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ మాత్ర మింగించకూడదన్నారు. ఈ మాత్ర మింగిన తరువాత పిల్లలకేమైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే ఆరోగ్య కార్యకర్తకు తెలియజేయాలన్నారు. ఎం ఈ ఓ సక్సేనా రాజు మాట్లాడుతూ మండలంలోని మొత్తం 54ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, 56 అంగన్వాడి కేంద్రాలకు మాత్రల కిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.సుబ్రహ్మణ్యం గురువారం జరిగే ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య సిబ్బంది, అంగన్ వాడి కార్యకర్తలు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి స్పందనకు 8 అర్జీల

విశాలాంధ్ర - పెద్దాపురం : డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమంలో సోమవారం ఆయా మండలాల నుంచి ఎనిమిది అర్జీలు అందినట్లు పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఇన్చార్జి ఏఓ పద్మజ, డీటీ భానుకుమార్ తెలిపారు. స్థానిక స్థల ఆక్రమణ ఖాళీ చేయించాలని, భూ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని, తొలగించిన విద్యుత్ మీటర్ను పునరుద్ధరించాలని తదితర సమస్యలపై ఎనిమిది ఫిర్యాదులు అందినట్లు వారు వెల్లడించారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికై ప్రతీ వారం స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతీ అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. స్పందనలో వచ్చే ప్రతీ అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారులకు సూచించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఏడీఏ, ఎన్ దైవకుమార్, రవిశంకర్, ప్రసాద్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమయస్ఫూర్తితో తప్పించుకోవాలి

విశాలాంధ్ర - రాజానగరం : ప్రస్తుత సమాజంలో చిన్నారులపై జరుగుతున్న అకృత్యాలు పెరిగిపోతున్నాయని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని దివాన్ చెరువుకి చెందిన సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజమండ్రి పార్లమెంట్ పరిధిలోని కడియపులంక గ్రామంలోని ప్రగతి స్కూల్‌లో కౌమార దశ బాలికలకు, చిన్నారులు తల్లులకు "ఆరోగ్యం మరియు పరిశుభ్రతలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన చుట్టూ ఎం జరుగుతుందో ప్రతి అంశాన్ని బాలికలు శ్రద్ధగా గమనించాలని,కొంతమంది కీచకులు పన్నే వలలో పడకుండా సమయస్ఫూర్తితో వారి నుండి తప్పించుకోవాలి పిలుపునిచ్చారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన డాక్టర్ హేమ నళిని మాట్లాడుతూ కౌమార దశలో బాలికల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, మహిళలకు, స్త్రీలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు.దీనిలో భాగంగా విద్యార్థులు, మహిళలు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ట్రస్టీ వినీల, ప్రగతి స్కూల్ ప్రిన్సిపల్ కర్రి ప్రదీప్,గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గద్దర్ మరణంతో ప్రజా పోరాటాలకు తీరనిలోటు

విశాలాంధ్ర - రాజానగరం : ప్రజా కళాకారుడు, ప్రజా గాయకుడైన గద్దర్ మరణంతో ప్రజా పోరాటాలకు తీరనిలోటు అని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్)జిల్లా అధ్యక్షులు జన్నుపల్లి సత్తిబాబు అన్నారు. మండలంలోని సూర్యారావుపేట వద్ద అఖిల భారత రైతు కూలీ సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో గద్దర్ మరణానికి సోమవారం సంతాపం తెలిపారు.దీనిలో భాగంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు.గద్దర్ పాటలతో లక్షలాది ప్రజలను చైతన్యవంతులు చేశారని ఆ సైతాన్యం వెలుగులో అనేక పోరాటాలు విజయాలు సాధించాయన్నారు.ఈ కార్యక్రమంలో ప్రగతి మహిళా సంఘం డివిజన్ నాయకురాలు మరుకుర్తి వీరలక్ష్మి, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు గున్నూరు వెంకటేశ్వర్లు, నక్క సచ్చివేణి, ఎం.సీత, గోరచ దుర్గ,జి.ప్రసాదు తోటకూర బేబీ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు వేయించడం అశ్రద్ధ చేయొద్దు

విశాలాంధ్ర-భీమవరం: ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులు మందును తప్పనిసరిగా వేయాలని, పిల్లలకు టీకాలు వేయించడం అశ్రద్ధ చేయొద్దని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ లో జరిగిన కార్యక్రమంలో నులిపురుగులు, సార్వత్రిక టీకాలకు సంబందించిన గోడ ప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఒకటీ నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలు, కిషోర్ బాలలకు అల్బెండజోల్ 400 మి.గ్రా టాబ్లెట్ ను అంగన్వాడి, పాఠశాలలు, కళాశాలలో ఆగస్టు 10 వ తేదీ నుండి అందించే కార్యక్రమం జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమం రోజుల్లో డీ వార్మింగ్ చేయబడిన పిల్లలు, కిషోర బాలలకు ఆగస్టు 17వ తేదీలలో జరిగే మాస్-అప్ రోజుల్లో మాత్రను వేయడం జరగాలన్నారు. అలాగే పిల్లలకు క్రమం తప్పక టీకాలు వేయించాలని ఆగస్టు 7 నుంచి 12వ తేదీ వరకు, సెప్టెంబర్ 11 - 16, అక్టోబర్ 9 -14 తేదీలలో చిన్నపిల్లలకు టీకాలు వేసే కార్యక్రమాన్ని వాడిలా వినియోగించాలన్నారు.

మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు

గ్రామ సర్పంచులు, వార్డు సభ్యుల ఎన్నికలకు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ విధిగా పాటించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఖాళీగా ఉన్న మూడు గ్రామ పంచాయతీ సర్పంచ్ లు, 28 వార్డు సభ్యుల పదవులకు ఉప ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలన్నారు. ఆగస్టు 8 నుండి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న స్క్రూటినీ, 14న ఉపసంహరణ, 19న పోలింగ్, ఓటర్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడం వెల్లడి ఉంటుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సిపిఓ కె.శ్రీనివాసరావు, డి ఎమ్ హెచ్ ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జెడ్. వెంకటేశ్వరరావు, హౌసింగ్ పీడీ ఎస్.టి.వి రాజేశ్వరరావు, వయోవృద్ధుల ట్రిబ్యునల్ మెంబర్ మేళ్ళం దుర్గా ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.